రాష్ట్రపతి విందులో..ఎంపీ మాగుంట

విశాలాంధ్ర-ఒంగోలు : పార్లమెంట్ సమావేశాలు సందర్భంగా భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అల్పాహార విందును ఇచ్చారు. కార్యక్రమంలో ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్ కర్, స్పీకర్ ఓం బిర్లా, కేంద్ర మంత్రులు, ఎంపీలతో కలిసి పాల్గొన్న ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసలురెడ్డి పాల్గొన్నారు.

విశాలాంధ్ర ప్రకాశం జిల్లా

జార్జ్ ఇంజనీరింగ్ కళాశాల ఎమర్జ్ 2023 గోడ పత్రిక ఆవిష్కరణ

విశాలాంధ్ర-మార్కాపురం : డాక్టర్ శామ్యూల్ జార్జ్ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం 17వ టెక్నో కల్చరల్ ఫెస్ట్ ఎమర్జ్ 2023 గోడ పత్రికను కళాశాల అకడమిక్ కౌన్సిల్ ఆవిష్కరించడం జరిగింది. ఈ నెల 17, 18న జాతీయ సాంకేతిక కల్చరల్ సదస్సు నిర్వహిస్తున్నట్లు కళాశాల కార్యదర్శి ఆదిమూలపు విశాల్ తెలియ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పీపీఎస్ నాయక్, ప్రొఫెసర్ ఆది సత్యనారాయణ కన్వీనర్‌లు, జెఎన్‌టీయూ కాకినాడ నుండి మరియు వివిధ కళాశాలల నుండి ప్రొఫెసర్లు పాల్గొన నున్నారు. కార్యక్రమంలో ఇంచార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ రాజబాబు, అకడమిక్ డీన్ డాక్టర్ మస్తానయ్య, వివిధ విభాగ అధిపతులు సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలి

విశాలాంధ్ర-ముండ్లమూరు : గ్రామాలలో ఉన్నటువంటి వనరుల ద్వారా వచ్చే ఆదాయంతో గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని ఈవోపీఆర్డి పి ఓబులేసు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటింటికి వెళ్లి ఇంటి పన్నులు వసూలు చేయాలన్నారు. ఆయుష్మాన్ భారత్‌లో అర్హులైన ప్రతి ఒక్కరిని చేర్పించాలన్నారు. గ్రామాల్లో ఉన్న చెరువుల ద్వారా వచ్చే ఆదాయంతో గ్రామాలను అభివృద్ధి చేసు కోవాలన్నారు. పంచాయతీలకు వాడుకున్న విద్యుత్ బిల్లులను సకాలంలో చెల్లించాలన్నారు. పంచాయతీలలో తడి పొడి చెత్త ద్వారా వచ్చే ఆదాయాన్ని గ్రామాలకు వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పదవీ విరమణ కార్యక్రమంలో పాల్గొన్న ముత్తుమల

విశాలాంధ్ర-గిద్దలూరు : మండలంలోని ఓబులాపురం గ్రామానికి చెందిన తాటగిరి జోసెఫ్ ప్రభాకర్ పదవీ విరమణ కార్యక్రమంలో గిద్దలూరు టిడిపి ఇన్చార్జ్ ముత్తుముల అశోక్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని వారికి పూలమాల శాలువా వేసి ఘన సన్మానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ శాఖలో 31 సంవత్సరాలుగా సేవలందిస్తూ అధికార యంత్రాంగంతో, ప్రజలతో మమేకంగా ఉంటూ మంచి పేరు తెచ్చుకున్నారని పదవీ విరమణ అనంతరం వారి జీవితం సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉంటూ భగవంతుడి ఆశీస్సులు ఉండాలని వారికీ శుభాకాంక్షలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభం

విశాలాంధ్ర-పెద్దదోర్నాల : మండల కేంద్రమైన దోర్నాలలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, వసంత జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఒకేషనల్ మరియు తెలుగు పరీక్ష గాను ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 203 మంది విద్యార్థులకు గాను, 23 మంది గైర్హాజరైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ వనంపల్లి రాజ్యలక్ష్మి తెలియజేశారు. అలాగే వసంత జూనియర్ కళాశాలలో 155 మంది విద్యార్థులకు గాను, ఎనిమిది మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు తెలిపారు. చీఫ్ సూపరిడెంట్ రాజశేఖర్‌రెడ్డి, డిపార్ట్మెంటు ఆఫీసర్ మబూఖన్‌లు తెలిపారు. దోర్నాల ఎస్ఐ శ్రీనివాసరావు ఎటువంటి ఇబ్బందులు జరగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

కళాశాల సమీపంలో 144 సెక్షన్

విశాలాంధ్ర-టంగుటూరు : మండల కేంద్రమైన టంగుటూరులో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. అందులో భాగంగా టంగుటూరులో ప్రభుత్వ కాలేజ్ ఆవరణ సమీపంలో 144 సెక్షన్ అమల్లో ఉందని స్థానిక ఎస్సై ఎస్కే ఖాదర్బాషా తెలిపారు. ఎస్సై తన సిబ్బందితో పాతశాల ఆవరణముందు బందోబస్తు నిర్వహించారు.

టీడీపీ కార్యకర్తను పరామర్శించిన ముత్తుముల

విశాలాంధ్ర-గిద్దలూరు : ఉయ్యాలవాడ గ్రామంలో ఇటీవల ప్రమాదవశాత్తు క్రిందపడి గాయపడి చికిత్స అనంతరం నివాసంలో విశ్రాంతి తీసుకొనుచున్న ముస్లిం మైనార్టీ టిడిపి కార్యకర్త షేక్ ఖాసిం వలి గిద్దలూరు టిడిపి ఇన్చార్జ్ ముత్తుముల అశోక్‌రెడ్డి బుధవారం పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకుని, తగు జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా సూచించారు. ఆయన వెంట మండల తెలుగుదేశం పార్టీ నాయకులు నంది శ్రీనివాసులు ఉన్నారు.

అసెంబ్లీలో 'నోరు విప్పేనా?

- జిల్లా అభివృద్ధి పట్టని ఎమ్మెల్యేలు, మంత్రి
- వెలిగొండ ప్రాజెక్టు, మల్లవరం డ్యాంకు నిధులు తేల్చని ప్రజాప్రతినిధులు
- వివాదాస్పద రాజకీయాలకే పరిమితం
- దీర్ఘకాలిక సమస్యలకు పరిష్కారమెప్పుడో..?

నత్తనడకన సాగుతున్న వెలిగొండ ప్రాజెక్టు సొరంగ పనులు

విశాలాంధ్ర-ఒంగోలు : రాష్ట్ర బడ్జెట్ సమావేశాలలోనైనా జిల్లాకు చెందిన అధికార పార్టీ ప్రజాప్రతినిధులు నోరు విప్పి జిల్లా అభివృద్ధికి నిధులు తెచ్చేనా అని జిల్లా ప్రజలు ఎదురు చూస్తున్నారు. కేవలం వివాదస్పర రాజకీయాలు చేసేటప్పుడు ప్రెస్‌మీట్‌లు పెట్టి మరీ ఇష్టం వచ్చినట్లు మాట్లాడే ప్రజాప్రతినిధులు జిల్లాకు నిధులు తీసుకురావటంలో, జిల్లాలోని సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోవటంలో అసెంబ్లీలో ఎందుకు నోరు మెదపటం లేదో అర్థం కాని విషయంగా మారింది. జిల్లా ప్రజలకు అసెంబ్లీ సమావేశాలంటే ప్రజాప్రతినిధులు కాలక్షేపం చేసే కార్యక్రమంలా మారింది.

ఎక్కడ వేసిన గొంగళిలా వెలిగొండ ప్రాజెక్టు

వెలిగొండ ప్రాజెక్టు పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న తీరుగా మారింది. పూర్తిస్థాయిలో నిధులు కేటాయించి పశ్చిమ ప్రకాశం ప్రజల కలలను సాకారం కావటం లేదు. టిడిపి హయాంలో జరిగిన పనులే తప్ప, వైసీపీ ప్రభుత్వం కొత్తగా పనులు చేసిన దాఖలాలు కూడా లేవు.దీనికి నిధుఉల రాబట్టంలో జిల్లాకు చెందిన మంత్రి, అధికార పార్టీ ప్రజాప్రతినిధులు విఫలమయ్యారు. ఒక సారి ముఖ్యమంత్రి జగన్ ప్రాజెక్టును పరిశీలించినా కనీసం మీడియాతో ఒక్క ముక్కకూడా చెప్పకుండా హెలికాప్టర్ ఎక్కి పలాయనం చిత్తగించారు. ఆ తర్వాత తీరిగ్గా మంత్రి సురేష్ కొంత అప్‌డేట్‌లు చెప్పినప్పటికీ అవి ఆచరణలో మాత్రం కనిపించటం లేదు. 1996లో నాటి ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు వెలిగొండ ప్రాజెక్టుకు శంకు స్థాపన చేశారు. నాటి సభకు దాదాపు 4లక్షల మంది ప్రజలు హాజరై తమ కలల రాజ్యం రాబోతుందని ఆనందం వ్యక్తం చేశారు. నాడు చంద్రబాబు సభలో మాట్లాడుతూ కేవలం 6 సంవత్సరాలలో ప్రాజెక్టును పూర్తి చేసి 7 వ సంవత్సరం నీరిస్తామని ప్రకటించారే తప్ప పార మట్టి వేసిన పాపాన పోలేదు. ఈ తర్వాత వచ్చిన రాజశేఖరరెడ్డి 2004లో కేవలం 6 సంవత్సరాలలో ప్రాజెక్టు పూర్తి చేస్తామని హామీ ఇవ్వటమే కాకుండా కొంత మేర పనులు ప్రారంభించారు. నాటి నుండి నేటి వరకు వెలిగొండ ప్రాజెక్టు పనులు ఏడాదికి కేవలం కిలో మీటర్ వంతున సొరంగాలు తవ్వారే తప్ప ప్రాజెక్టును పూర్తిస్థాయిలో పూర్తి చేయలేదు. పూర్తయిన మొదటి సొరంగం నుండి రిజర్వాయర్‌లోకి నీరు వచ్చిన వాటిని అధికారులు వెంటనే నిలిపివేసే పనులు చేపట్టారు. ముంపు గ్రామ ప్రజలకు పునరావాసం కల్పించని కారణంగా ఆయా గ్రామాలు మునుగుతాయంటున్నారే తప్ప ఇన్ని సంవత్సరాల కాలంలో వారి గురించి పట్టించుకున్న నాథుడు లేదు. ప్రస్తుతం ప్రాజెక్టు పూర్తి కావటానికి రూ.20వేల కోట్లు అవసరం ఉండగా, ప్రభుత్వాలు మాత్రం కేవలం ఉద్యోగుల జీతాలకు, విద్యుత్ బిల్లులకు మాత్రమే నిధులు కేటాయిస్తూ మమ అనిపిస్తున్నాయి.

జలయజ్ఞం మొదటి ప్రాజెక్టు మల్లవరం డ్యాంకే దిక్కులేదు

రాజశేఖర్‌రెడ్డి చేట్టిన జలయజ్ఞం మొదటి ఫేజ్‌లో మొత్తం దాదాపు 56 ప్రాజెక్టులు చేపట్టగా వాటిలో కేవలం మల్లవరం ప్రాజెక్టు మాత్రమే పూర్తయింది. అయితే దానిలో కూడా కేవలం ప్రాజెక్టు నిర్మించారే తప్ప నీటి కాల్వలను కట్టటం మరిచారు. దీంతో ప్రాజెక్టు ద్వారా వచ్చే నీరు చివరి భూమి రైతులు సద్వినియోగం చేసుకోవటానికి వీలులేక, ఎక్కువ భాగం నీరు సముద్రం పాలవుతుంది. నాటి నుండి నేటి వరకు ప్రాజెక్టును పట్టించుకున్న దాఖలాలు లేవు. ప్రస్తుతం మూడు గేట్లు పూర్తిగా విరిగిపోయి వాటి నిర్మాణం కోసం సుమారు రూ.3 కోట్లు కేటాయించారు. అయితే ఇప్పటి వరకు ఒక్క గేటు ను మాత్రమే నిర్మించగా, మరో రెండు గేట్లు నిధులు లేక అలాగే ఉండిపోయాయి. అంతే కాదు ప్రాజెక్టులోని మొత్తం 15 గేట్లుకు గాను ప్రస్తుతం మూడు గేట్లు మాత్రం బాగుండగా మిగిలిన గేట్లు కూడా జీర్ణస్థితికి చేరుకున్నాయి. ఈ మూడు గేట్లు పెట్టేలోపు మిగిలిన గేట్లు కూడా విరిగిపోయే అవకాశం వుంది. ఇవన్నీ తెలిసిన స్థానిక ప్రజాప్రతినిధులు మాత్రం నొరు మెదపటం లేదు. కేవలం ప్రాజెక్టులు కట్టటం ద్వారా కాంట్రాక్టర్లు ద్వారా తమకు వచ్చే కమీషన్‌కు ఆశపడి ప్రాజెక్టులు నిర్మిస్తున్నారే తప్ప ఆ తర్వాత నిర్వాసితులకు పునరావాస కేంద్రం ఏర్పాటు చేయటంలో, కాల్వలు నిర్మించటం ద్వారా తమకు ఒదిగేదేమీ లేదని గాలికి వదిలేస్తున్నారు. ప్రజాప్రతి నిధులు దీర్ఘకాలిక సమస్యలపై దృష్టి సారించి, జిల్లా ప్రజల సమస్యలు తీరుస్తారని, బడ్జెట్ సమావేశాలలో ప్రజాగళం వినిపిస్తారని ఆశిద్దాం.

మల్లవరం డ్యాంను పరిశీలిస్తున్న మాజీ మంత్రి దేవినేని, దామచర్ల (ఫైల్)

మార్కెట్ స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర-దర్శి : దర్శి పట్టణంలో కూరగాయల, మాంసం, చేపల విక్రయం జరుపుకునేందుకు బుధవారం శాసన సభ్యులు డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్ స్థలాన్ని పరిశీలంచారు. ఎంతో కాలం నుండి రోడ్డు వెంట స్టాల్ వలన ట్రాఫిక్ అంతరాయం జరుగుతుందని ప్రజా అభ్యర్థన మేరకు నగర పంచాయితీ పరిధిలో మార్కెట్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ వై.వి.సుబ్బయ్య, కుమ్మిత అంజిరెడ్డి, పలువురు వైసిపి నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలపై ఎస్సీ సత్యనారాయణకు వినతి

విశాలాంధ్ర-పామూరు : మండలంలో నెలకొని ఉన్న సమస్యలను పరిష్కరించి మెరుగైన విద్యుత్తును అందించాలని ఎస్సీ డి.సత్యనారాయణకు మండల వైసీపీ అధ్యక్షులు గంగసాని హుస్సేన్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం వినతిపత్రాన్ని అందజేశారు. మండలంలో రెండు సబ్ స్టేషన్‌లు మంజూరుతో పాటులో వోల్టేజ్ సమస్య పరిష్కారం ట్రాన్స్‌ఫార్మర్లు, విరిగిన విద్యుత్ స్తంభాలు, వైర్‌ల కోసం 50 లక్షలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చినట్లు వైసిపి మండల అధ్యక్షుడు గంగసాని హుస్సేన్‌రెడ్డి, మండల వైసీపీ యువజన అధ్యక్షులు పట్టణ ఉపసర్పంచ్ యాదాల వెంకట సాయికిరణ్‌లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కో ఆప్షన్ సభ్యులు షేక్ కాజా నాయబ్ రసూల్,సచివాలయ మండల కన్వీనర్ ఖాదర్ భాష, గాజులపల్లి వెంకటేశ్వరరెడ్డిలు పాల్గొన్నారు.

మద్దాలి మాధవరావుకు అత్యున్నతమైన పురస్కారం

సామాజిక కళా రంగంలో విశిష్ట సేవలు

విశాలాంధ్ర-చీమకుర్తి : సామాజిక కళా రంగంలో విశిష్ట సేవలు చేస్తున్న ప్రకాశం జిల్లా చీమకుర్తికి చెందిన శ్రీ అభయ కళారాధన సాహిత్య సాంస్కృతిక సేవ సంస్థ అధ్యక్షులు డాక్టర్ మద్దాలి మాధవరావు అత్యున్నత మైన పురస్కారం అందుకున్నారు. హైదరాబాదులోని రవీంద్ర భారతి ఆడిటోరియంలో జరిగిన జాతీయ సేవా పురస్కారాల కవి సమ్మేళనం కార్యక్రమంలో భాగంగా లిటిల్ ఛాన్స్ అకాడమీ, ఏపూరి బ్రదర్ ఫుడ్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ పురస్కార వేడుకల్లో పద్మశ్రీ కె.విశ్వనాథ్ జీవన సాఫల్యపురస్కారాన్ని డాక్టర్ మద్దాలి మాధవరావుకు అందజేశారు. కళా రంగంలో డాక్టర్ మద్దాలి మాధవరావు చేసినటువంటి సేవలకు గుర్తుగా ఈ అరుదైన పురస్కారం లభించింది. ఈ కార్య క్రమంలో డిప్యూటీ డైరెక్టర్ బి.నాగా ర్జున సామాజికవేత్త సూరేపల్లి రవికుమార్ ఎన్‌హెచ్‌ఆర్‌వో తెలంగాణ అధ్యక్షులు డాక్టర్ బి నాగరాజు సినీ రచయిత ఆలూరు విల్సన్ ఇందిర ఫౌండేషన్ అధ్యక్షురాలు శ్రీమతి ఇందిర లయన్ రజిత లహరి సామాజికవేత్తలు శ్రీమతి సుధా ఠాకూర్ సామాజికవేత్త డాక్టర్ సామ్రాట్ గోవర్ధన్ డాక్టర్ రాధా కుసుమ ఏపూరి బ్రదర్ హుడ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఏపూరి బాబురావు లిటిల్ చాంప్స్ అకాడమీ అధ్యక్షులు యువ సామాజికవేత్త అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సినీ నటులు మాణిక్ తేజ మాట్లాడుతూ సమాజ సేవ అనేది ఎంతో గొప్పదని కళా రంగానికి డాక్టర్ మద్దాలి మాధవరావు చేస్తున్న కృషి ప్రశంసనీయమని అన్నారు పద్మశ్రీ కళాతపస్వి కే.విశ్వనాథ్ స్మారక పురస్కారం అందుకోవటం చాలా గొప్ప విషయమని అన్నారు. మద్దాలి మాట్లాడుతూ సేవా కార్యక్రమాలు చేయటం తనకెంతో ఇష్టమైన దని ఈ పురస్కారం రావడం చాలా ఆనందంగా ఉందని అన్నారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేసేందుకు ఈ పురస్కారం స్ఫూర్తినిస్తుందని అన్నారు.

బీఎంసీ సంస్మరణ సభకు ఏర్పాట్లు పూర్తి

మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

విశాలాంధ్ర-పామూరు : గురువారం జరుగు మండల టిడిపి నాయకులు, మాజీ జెడ్పిటిసి స్వర్గీయ బొల్లా మాల్యాద్రి చౌదరి సమస్ఫూర్ణ సభకు ఏర్పాట్లు పూర్తయినట్లు కనిగిరి మాజీ శాసనసభ్యులు, టిడిపి ఇంచార్జ్ డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి చెప్పారు. బుధవారం సాయంత్రం మండల టిడిపి నాయకులుతో కలిసి శ్రీమహాలక్ష్మి మిల్క్ డైరీ ఆవరణంలో జరుగుతున్న ఏర్పాట్లును ఉగ్ర నరసింహారెడ్డి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని టిడిపి శాసనసభ్యులు గొట్టిపాటి రవి, డోలా వీరాంజనేయులు, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, బొల్లినేని రామారావు, దామచర్ల జనార్ధన్, ఇంటూరి నాగేశ్వరరావు ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని టిడిపి ఇన్చార్జులు ముఖ్య నాయకులు పాల్గొంటారని ఉగ్ర తెలిపారు. కార్యక్రమంలో పువ్వాడి వెంకటేశ్వర్లు ప్రభాకర్ చౌదరి, మన్నం రమణయ్య, డోలా శేషాద్రి, గుంటుపల్లి శ్రీనివాసులు, కోటిరెడ్డి పాల్గొన్నారు.

ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణలో అశ్రద్ధ చూపితే కఠిన చర్యలు

విశాలాంధ్ర బ్యూరో-ఒంగోలు : ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణలో ఏమాత్రం అశ్రద్ధ చూపినా బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ ఏ.ఎస్. దినేష్ కుమార్ హెచ్చరించారు. బుధవారం ఆయన ఒంగోలు నగరంలోని కోర్టు సెంటర్ సమీపంలో ఉన్న నారాయణ జూనియర్ కాలేజీలో పరీక్షలు జరుగుతున్న తీరును పరిశీలించారు. విద్యార్థుల హాజరు. వారికి కల్పించిన సదుపాయాలపై ఆరా తీశారు. సెల్‌ఫోన్‌లు, స్మార్ట్ వాచీలు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను పరీక్షా కేంద్రంలోకి అనుమతించరాదని అధికారులకు స్పష్టం చేశారు. విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తరువాతే పరీక్షా కేంద్రంలోకి అనుమతించాలని చెప్పారు. పరీక్షల నిర్వహణతో సంబంధం లేని వారు ఈ ప్రాంగణంలోకి ప్రవేశించకుండా గేట్లు వేయాలని ఆదేశించారు. చీఫ్ సూపరింటెండెంట్ తప్ప ఇతర సిబ్బంది ఎవరినీ సెల్‌ఫోన్లో అనుమతించరాదని అన్నారు. జిల్లాలో నాలుగు సమస్యాత్మక కేంద్రాలను గుర్తించామని, అక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని తెలిపారు. తొలిరోజు ఎలాంటి అవాంఛ నీయ ఘటనలు జరుగకుండా పరీక్షలు ముగిశాయని కలెక్టర్ చెప్పారు. ఈ సందర్భంగా ఆయన వెంట ఆర్.ఐ.ఓ. సైమన్ విక్టర్ ఉన్నారు.

కుక్కల దాడిలో జింక మృతి

విశాలాంధ్ర-పెద్దదోర్నాల : కుక్కల దాడిలో జింక మృతిచెందిన సంఘటన మండలంలోని మోట్ల మల్లికార్జునపురం వద్ద బుధవారం చోటు చేసుకుంది. అందిన సమాచారం మేరకు కుక్కలు దాడి చేయడంతో జింక మృతి చెందినట్లు అటవీ శాఖ అధికారి విశ్వేశ్వరరావు తెలియజేశారు. పశువైద్యాధికారిచే శవ పంచనామ చేసి ఖననం చేయనున్నట్లు తెలిపారు.

పోస్టల్ బ్యాలెట్ బాక్సులు తరలింపు

విశాలాంధ్ర-ఒంగోలు : ఎమ్మెల్సీ ఎన్నికల విధులలో పాల్గొన్న ఉద్యోగులు ఓటు వేసిన పోస్టల్ బ్యాలెట్ బాక్సను నోడల్ ఆఫీసర్‌గా ఉన్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఉమాదేవి ఆధ్వర్యంలో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో బుధవారం డి.ఆర్.ఓ. ఛాంబరులో పరిశీలించారు. ఓట్లు లెక్కించి బ్యాలెట్ బాక్కు సీలు వేశారు. అనంతరం దీనిని చిత్తూరులోని ఓట్ల లెక్కింపు కేంద్రానికి పోలీసు బందోబస్తుతో తరలించారు. రాజకీయ పార్టీల ప్రతి నిధులు వై.సి.పి. రాష్ట్ర ప్రచార కమిటీ ప్రధాన కార్యదర్శి దామరాజు క్రాంతి కుమార్, టి.డి.పి. అధికార ప్రతినిధి కాలేషా బేగ్, కాంగ్రెస్ తరపున షేక్ రసూల్ పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీ - మహిళకు తీవ్ర గాయాలు

విశాలాంధ్ర-సింగరాయకొండ : ఆర్టీసీ బస్సు ఢీకొని మహిళకు తీవ్ర గాయాలైన సంఘటన బుధవారం జరిగింది. పోలీసులు తెలిపి వివరాలు ప్రకారం పాకల గ్రామానికి చెందిన వల్లమూడి సీతమ్మ (60) పాకల రోడ్డు వైపే వెళ్తుండగా ఆర్టీసీ డిపో వైపుకు వెళుతుండగా విజయవాడ నుండి ఉదయగిరి వెళున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో రోడ్డుకి తల తగిలి తీవ్ర గాయాలు పాలైంది. సంఘటన స్థలానికి ఎస్సై ఫిరోజా ఫాతిమా పరిశీలించి క్షతగాత్రురాలని ఒంగోలు ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తామని ఎస్సై ఫాతిమా తెలిపారు.

గిద్దలూరు టీడీపీలో నూతన ఉత్తేజం

- ఎమ్మెల్సీ ఎన్నికల్లో నిర్మాణాత్మక పాత్ర
- ఆకట్టుకున్న ప్రచార సరళి

విశాలాంధ్ర-అర్ధవీడు : గిద్దలూరు నియోజకవర్గ టిడిపిలో నూతనుత్తేజం కనిపిస్తోంది. ఎమ్మెల్సీ ఎన్నికలు ఆ పార్టీని పూర్తి స్థాయిలో కదిలేలా చేశాయి. ఒకింత ఆత్మవిశ్వాసాన్ని పాదుగొలిపాయనే చెప్పాలి. ఫలితంగా దాదాపు రెండు నెలల కిందటి వరకు గిద్దలూరు పరిసరాలకు మాత్రమే పరిమితమైన టిడిపి గొంతుకను ఎన్నికల నేపథ్యంలో నియోజకవర్గ మారుమూలకూ వినిపించింది. నిద్రాణంగా ఉన్న ఆ పార్టీ కేడర్ నూ, సాధారణ ఓటరును సైతం ఒక్కసారిగా తట్టి లేపినట్లు అనిపించింది. ఆ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి ముత్తుముల అశోక్ రెడ్డి నాయకత్వంలో ఎన్నికల ప్రచారం చాలా హుందాగా సాగిందనే చెప్పాలి. ఇది నియోజకవర్గంలో ఆ పార్టీ ప్రచార సహజ సరళికి భిన్నమైన ధోరణే. బృందాలుగా ఏర్పడి ఇంటింటికీ తిరిగి ఐక్యతను ప్రదర్శిస్తూ ఓటు అభ్యర్థించారు. ఎమ్మెల్సీ ఓటర్లు లేని కొన్ని గ్రామాల్లో పర్యటించినప్పుడు స్థానికులను కలుసుకోవడం కనిపించింది. వైసిపి పథకాల లబ్ధి పై ఆరా తీయడం, లోటు పాట్లు తెలుసుకోవడం తటస్థించింది. వైసిపి ప్రభుత్వ లోపాలపై స్థానికులతో సంభాషిస్తూ కనిపించారు. ఇలా ఒక వైపు ఓటు అభ్యర్థిస్తూ, మరో వైపు నిద్రాణంగా ఉన్న పార్టీ శ్రేణులను మేలుకొలుపుతూ కనిపించింది. ఈ ప్రయత్నంలో ఎన్ని ఓట్లు సాధిస్తారనే గణాంకాల కన్నా, ఉన్న కేడర్ను ఉత్తేజ పరచడం, పార్టీ సాధారణ ఓటరును స్థిరపరుచుకోవడం, వైసిపి పంచన చేరిన తమ నాయకత్వాన్ని ఆకర్షించడం ప్రధాన అంశంగా కనిపిస్తోంది. ప్రచార సందళిలో ఆ సంబంధాలను కదిపినట్లు తెలుస్తోంది. ప్రచారంలో ఉన్న కేడర్ ను పూర్తి స్థాయిలో నిమగ్నం చేయడంలో ముత్తుముల ప్రణాళిక బద్ధంగా వ్యవహరించారనే చెప్పాలి. గడిచిన నాలుగేళ్లలో పార్టీ నిర్మాణం కోసం చేసిన ప్రయత్నాలు ఒక ఎత్తు. గత రెండు నెలలుగా చేసిన ప్రయత్నం మరో ఎత్తుగా చెప్పాలి. ఈ రెండు నెల్ల కాలంలో శుభ కార్యాల ఆహ్వానాలు అశోక్ రెడ్డికి పెరిగాయి. కొన్ని అత్యవసర సందరాల్లో వ్యక్తి గత పనులు వాయిదా వేసుకొని శుభకార్యాలకు హాజ రయ్యారని చెబుతారు. పార్టీ సమావేశాలు గిద్దలూరులో నిర్వహించడానికి బదులు మండల కేంద్రాలకు విస్తరించారు. ఎన్నికల నేపథ్యంలో మండలానికి రెండు మూడు సమావేశాలు నిర్వహించి కేడర్ కు దిశా నిర్దేశం చేశారు. ఈ ప్రయత్నం మెరుగైన ఫలితం ఇచ్చినట్లు ఆ పార్టీ శ్రేణులు అభిప్రాయ పడుతున్నాయి. 2024 ఎన్నికలకు ఇది రిహార్స లుగా భావిస్తున్నాయి. రాబోవు ఎన్నికలను సమర స్ఫూర్తితో ఎదుర్కొనే విశ్వాసాన్ని వ్యక్తం చేస్తున్నాయి.

నేటి నుంచి 144 సెక్షన్ అమలు

విశాలాంధ్ర-కొమరోలు : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల పరిసర ప్రాంతాల్లో 100 మీటర్ల దూరం వరకు నేటి నుండి 144 సెక్షన్ అమలవుతుందని ఎస్ఐ ఏ.సుబ్బరాజు తెలిపారు. ఇంటర్మీడియట్ పరీక్షల నేపథ్యంలో ఈ ప్రాంతంలో ఎవరు గుంపులు గుంపులుగా తిరగవద్దని, జిరాక్స్ షాపులను తెరవద్దని ఎస్సై ఆదేశాలు జారీ చేశారు. మాస్ కాపీయింగ్‌కు పాల్పడిన, బయట నుండి కాపీయింగ్‌కు ఎవరైనా ప్రయత్నించిన వారిపైన కేసులు నమోదు చేస్తామన్నారు. గత సంవత్సరం పదవ తరగతి పరీక్షల సమయంలో 35 మంది యువకులపై కేసులు నమోదు చేసిన ఘటనను మరవ వద్దని చట్ట వ్యతిరేకంగా ఎలాంటి కార్యక్రమాలకు పాల్పడిన వారి పైన కేసులు నమోదు చేస్తామన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని చక్కగా చదివి పరీక్షలు రాయాలని ఇంటర్మీడియట్ విద్యార్థులకు సూచించారు. ఇంటర్మీడియట్ విద్యార్థులు ముగ్గురు కలిసి ఒకే ద్విచక్ర వాహనం పైన రావద్దని, అసలు ద్విచక్ర వాహనాన్ని నడపవద్దని, ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందన్నారు. విద్యార్థులకు ద్విచక్ర వాహనాన్ని ఇస్తే పేరెంట్స్ పై చర్యలు తీసు కుంటామన్నారు. ఆటోల్లో 8 మంది కంటే ఎక్కువ మంది విద్యార్థులను తీసుకురావద్దని, 8 మంది కంటే ఎక్కువ మంది విద్యార్థులతో వస్తే ఆటోల పైన కేసులు నమోదు చేస్తామన్నారు.

'ఈ - పంట'పై సామాజిక తనిఖీ

విశాలాంధ్ర-అర్ధవీడు : రబీ సీజన్లో చేసిన ఈ - పంట నమోదు ముసాయిదా పై మొహిద్దీన్ పురం రైతు భరోసా కేంద్రంలో బుధవారం సామజిక తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీకి సర్పంచ్ కందుల రామకృష్ణారెడ్డి అధ్యక్షత వహించారు. సర్పంచి మాట్లాడుతూ వేసవిలో పత్తి, నువ్వు పైర్లు సాగవుతున్నందున రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులు, పురుగు మందులు అందుబాటులో ఉంచాలని కోరారు. ఏవో ఎస్ కె మహమ్మద్ మాట్లాడుతూ రబీ లో నమోదు చేసిన ఈ -పంట వివరాలు ముసాయిదా రూపంలో మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో ప్రదర్శిం చామని తెలిపారు. ఈ నెల 17వ తేదీ లోపు అభ్యన్తరాలు రాతపూర్వకంగా తెలపాలన్నారు. సవరించిన తుది జాబితా ఈ నెల 20 న ప్రదర్శస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎస్ కొండయ్య, విఆర్వో ఎం శ్రీనివాసులు, విఏఏ భారతి పాల్గొన్నారు.

నేడు వెలిగొండ స్వామి తిరుణాల

విశాలాంధ్ర-కొనకనమిట్ల : మండలంలోని గార్లదిన్నె పంచాయితీలో గల వెలుగొండ క్షేత్రంలోని వెలుగొండ వెంకటేశ్వర స్వామి ఆలయంలో కొలువైన వెంకటేశ్వర స్వామి తిరుణాల నేడు గురువారం అత్యంత వైభవంగా జరగనుంది. బుధవారం గరుడోత్సవం కన్నుల పండుగ జరిగింది. ఈ నెల 7వ తేదీ నుంచి ప్రారంభమైన బ్రహ్మోత్సవాలకు జిల్లాతో పాటు రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కలు తీర్చుకుంటారు. స్వామివారిని దర్శించుకునేందుకు పచ్చడిభక్తుల కోసం అన్ని ఏర్పాట్లు చేసినట్టు ఆలయ కార్యనిర్వాహణాధికారి ఈదుల చెన్నకేశవరెడ్డి ఆలయ చైర్మన్ తిరుపతిరెడ్డిలు తెలిపారు. తిరుణాలలో వైసిపి ఆధ్వర్యంలో ఒక విద్యుత్ ప్రభ అన్న దానసత్రాలలో పాట కచేరీలు సత్య హరిచంద్ర బాలనాగమ్మ వంటి పౌరాణిక నాటకాలు ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తుల కోసం పొదిలి మార్కాపురం కనిగిరి ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నారు ఏదో వర్గాల అన్నదాన సత్రాలలో ఉచితంగా అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు భక్తుల కోసం వైద్యాధికారి ఎస్పీ బాలయ్య ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహి స్తున్నారు. తిరునాళ్లలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా దర్శి డిఎస్పి సూర్య నారాయణరెడ్డి ఆధ్వర్యంలో పొదిలి సీఐ సుధాకర్‌రావు పర్య వేక్షణలో 9 మంది ఎస్ఐలు 100 మంది పోలీస్ సిబ్బందితో గట్టి బందోబస్తు నిర్వహిస్తున్నట్లు ఎస్సై కే దీపిక తెలిపారు.

ఆంధ్ర తెలంగాణ రాష్ట్రస్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలు ప్రారంభం

విశాలాంధ్ర-కొనకనమిట్ల : మండలంలోని గార్లదిన్నె పంచాయతీలో గల వెలుగొండ క్షేత్రంలో వెలసిన వెలుగొండ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో జరుగుతున్న బ్రహ్మోత్స వాల్లో భాగంగా బుధవారం ఆంధ్ర తెలంగాణ రాష్ట్ర స్థాయి ఎడ్ల బాల ప్రదర్శన బండలాగుడు పోటీలను కంభం మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులురెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉడుముల మాట్లాడుతూ ఒంగోలు జాతి గిత్తలను సంరక్షించు కోవాలని వాటి ఖ్యాతిని నలుదిశల చాటాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గిత్తల పెంపకం పట్ల ఆసక్తి చూపుతున్న ఎడ్ల యజమానులకు అభినందనలు తెలిపారు. బుధవారం జరిగిన రెండు పండ్ల సైజు భాగంలో ఆరు జతలు ఆరుపండ్ల సైజు విభాగంలో 9 జతల ఎద్దు పాల్గొన్నాయి. ఈ పోటీలను ఆలయ చైర్మన్ తిరుపతి రెడ్డి ఆధ్వర్యంలో మేకలవారిపల్లిరెడ్ల సంఘం వారి పర్యవేక్షణలో నిర్వహించారు. పోటీలను తిలకించేందుకు ప్రజల అధిక సంఖ్యలో తరలివచ్చి పోటీలను తిలకించారు. ఈ కార్య క్రమంలో ఎంపీపీ మురళీకృష్ణ జడ్పిటిసి సభ్యుడు ఏడుకొండలు, వైసీపీ మండల కన్వీనర్ శంకర్‌రెడ్డి, వైసీపీ నాయకుడు కామసాని వెంకటేశ్వరరెడ్డి, ఎస్సీ సెల్ కార్యదర్శి చిరుగురి సిహెచ్ కోటేశ్వరరావు, వైసిపి నాయకులు కార్యకర్తలు అధిక పాల్గొన్నారు.

శివ క్షేత్ర నిర్మాణానికి రూ.లక్ష విరాళం

విశాలాంధ్ర - బాపట్ల రూరల్ : సూర్యలంక శివ క్షేత్ర ఆలయం నిర్మాణం అద్భుత రీతిలో జరుగుతున్నదని మాజీ మంత్రి గాదె వెంకటరెడ్డి అన్నారు. బుధవారం ఆయన ఆలయాన్ని సందర్శించి, పూజలు నిర్వహించి రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్తలు మాట్లాడుతూ ఆలయంలో విగ్రహ ప్రతిష్ట మహోత్సవము మే నెల 12,13 తేదీలలో జరుగుతుందని తెలి పారు. శృంగేరి జగద్గురువులు ఆశీస్సులతో ముందుకెళుతున్నట్లు తెలిపారు. కావున భక్తులందరూ సహకరించాలని కోరారు. ధర్మకర్తలు ఎం. దశరథ మహారాజు, జి. మూర్తి రాజు, స్థపతి గోపాలకృష్ణ, చిత్రకారులు బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

నేడు జననేత బీఎంసీ సంస్మరణ సభ

హాజరుకానున్న రాష్ట్ర, జిల్లా టీడీపీ నాయకులు



విశాలాంధ్ర-పామూరు : టిడిపిలో జనాకర్షణ కలిగిన నేత మాజీ జెడ్పిటిసి బొల్లా మాల్యాద్రి చౌదరి ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో అలసిపోయిన సమయంలో మృత్యువు కబళించింది. ఈ నెల నాలుగో తేదీన ఉదయం 2 గంటల సమయం తర్వాత గుండెపోటు రావడం హఠాన్మరణం చెందడం కార్యకర్తలు, నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని గురువారం దశదినకర్మ సందర్భంగా శ్రీ మహాలక్ష్మి డైరీలో సంస్మరణ సభ జరుగుతుంది. ఈ సభకు బంధుమిత్రులతో పాటు టిడిపి రాష్ట్ర జిల్లా నాయకులు పాల్గొననున్నారు. మండలంలోని పుట్టం నాయుని పల్లి గ్రామానికి చెందిన బొల్లా చిన్న కొండయ్య లక్ష్మీదేవి దంపతుల మూడవ సంతానం మాల్యాద్రి చౌదరి. అమ్మమ్మ గారి గ్రామమైన పి.సి పల్లి మండలం మెట్లవారి పల్లెలో 1963 జూలై ఒకటవ తేదీన మాల్యాద్రి చౌదరి జన్మించారు. ప్రాథమిక విద్య పుట్టం నాయిని పల్లి లోను, 6,7 తరగతులు లక్ష్మీ నరసాపురంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత ఉన్నత పాఠశాలలోను చదువుకున్నారు. తరువాత చదువుకు స్వస్తి చెప్పి చిన్న వయసులోనే పదివేల రూపాయలుతో తెలంగాణ ప్రాంతంలోని మణుగూరు లో బొగ్గు వ్యాపారంలో హమాలీగా ముఠా గట్టారు. ఆనతి కాలములోనే బొగ్గు వ్యాపారంలోకి ప్రవేశించి వ్యాపారుల అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా ఎన్నికయ్యారు. పుట్టమనాయని పల్లి గ్రామానికి చెందిన రాయవరపు లక్ష్మయ్య నారాయణమ్మల దంపతుల కుమార్తె మహాలక్ష్మితో 1984వ సంవత్సరంలో మాల్యాద్రి చౌదరికి వివాహ మైంది. ఆయనకు ఒకే ఒక కుమారుడు బొల్లా నరసింహారావు లక్ష్మీ నరసరావు ఎంపీటీసీగా కొనసాగుతున్నారు. వ్యాపార పరంగా విజయవాడలో స్థిరపడిన మాల్యాద్రి చౌదరి స్వర్గీయ దేవినేని నెహ్రూ అనుచరుడిగా కొనసాగారు. లిక్కర్ వ్యాపారం లోకి ప్రవేశించిన మాల్యాద్రి చౌదరి బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గా ఎన్నికయ్యారు. భవానిపురంలో మిత్రులతో కలిసి ఫైనాన్స్ వ్యాపారం ప్రారంభించారు. వ్యాపార పరంగా అంచలంచెలుగా ఎదుగుతున్న మాల్యాద్రి చౌదరి రాజకీయ రంగ ప్రవేశం చేశారు. 1996లో పామూరు మండలం జడ్పిటిసికి ఉప ఎన్నిక అనివార్యమైంది. కనిగిరి మాజీ శాసనసభ్యుల స్వర్గీయ ఇరిగినేని తిరుపతి నాయుడు పిలుపుమేరకు కాంగ్రెస్ పార్టీలో చేరి తన శ్రీమతి మహాలక్ష్మి ని జెడ్పిటిసి గా ఉప ఎన్నికల్లో గెలిపించుకున్నారు. 2021 లో జరిగిన స్థానిక సంస్థ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం తీవ్రంగా కృషి చేశారు. తను కూడా జడ్పిటిసిగా ఎన్నికయ్యారు. కాంగ్రెస్ పార్టీలో తన వర్గాన్ని చిన్న చూపు చూస్తున్నారని కలత చెందిన మాల్యాద్రి చౌదరి అప్పటి జడ్పీ చైర్మన్ ముక్కు కాశిరెడ్డి తో జతకట్టి టిడిపి లో కొనసాగారు. మండల రాజకీయాలలో ముఖ్య పాత్ర పోషిస్తూ పామూరు లో నివాసం ఏర్పరచు కున్నారు. లిక్కర్, రియల్ ఎస్టేట్ వ్యాపారాలు ప్రారంభించారు. ప్రకాశం, నెల్లూరు, జిల్లాలలో మిల్క్ డైరీలు ఏర్పాటు చేసి ప్రత్యక్షంగా పరోక్షంగా వందలాది మందికి జీవనోపాధిని కల్పిస్తున్నారు. మాజీ మంత్రి ముక్కు కాశిరెడ్డి తో కలసి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. 2014,19 ఎన్నికల్లో బుర్ర మధుసూదన్ యాదవ్ గెలుపు కోసం తీవ్రంగా కృషి చేశారు. తర్వాత జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో శాసనసభ్యులు బుర్ర మధుసూదన్ యాదవ్ తో మాల్యాద్రి చౌదరి విభేదించారు. 2021 లో తెలుగుదేశం పార్టీ లో చేరారు. తెలుగుదేశం పార్టీని బలోపేతం చేసి 2024లో డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి గెలుపే ధ్యేయముగా మాల్యాద్రి చౌదరి తుది శ్వాస విడిచే వరకు పనిచేస్తూనే ఉన్నారు. కాంగ్రెస్ వైసిపి, తెలుగుదేశం మూడు పార్టీలకు తన సేవలను నిస్వార్థముగా మాల్యాద్రి చౌదరి అందించారు. ఏ పార్టీలో వున్నా భయమెరుగని నేతగా కార్యకర్తలకు కొండంత అండగా ఉండటం, ముక్కు చూటిగా మాట్లాడటం ప్రశ్నించడం మాల్యాద్రి చౌదరి నైజం.

తాగునీటికి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి

కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్

విశాలాంధ్ర బ్యూరో-ఒంగోలు : వేసవిలో తాగునీటికి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఏ.ఎస్.దినేష్ కుమార్ పునరుద్ఘాటించారు. బుధవారం ఆయన కలెక్టరేట్ నుంచి మండల స్థాయి అధి కారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సాగర్, గుండ్లకమ్మ నీటితో చెరువులను నింపడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని స్పష్టం చేశారు. చెరువులను నీటిని అక్రమంగా ఇతర అవసరాలకు ఎవరైనా మళ్లిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. అవసరమైనచోట ట్యాంకర్ల ద్వారా మంచినీటిని సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు కలెక్టర్ స్పష్టం చేశారు. జలజీవన్ మిషన్ పనులను కూడా వేగవంతం చేయాలని చెప్పాడు. ఉపాధి హామీ పనులకు జాబ్ కార్డుల మంజూరులో, హాజరు నమోదులో అవకతవకలకు పాల్పడినట్లు గుర్తిస్తే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనర్హులు కార్డులు పొందితే వాటిని రద్దు చేసేందుకు వచ్చే వారం రోజులపాటు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎం.పి.డి.ఓ.లను, ఏ.పి.ఓ. లను కలెక్టర్ ఆదేశించారు. ఉపాధి పనులకు వచ్చే కూలీల హాజరు పెరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. సచివాలయాల ద్వారా సమర్థంగా సేవలు అందేలా పర్యవేక్షిం చాలని ఎం.పి.డి.ఓ.లను, మున్సిపల్ కమి షనర్లను కలెక్టర్ ఆదేశించారు. సచివాలయ సిబ్బంది సమస్యలను పరిష్కరిస్తున్న తీరును సమీక్షించాలని వీరికి దిశానిర్దేశం చేశారు. నిర్దిష్ట సమయాలలో సచివాలయ సిబ్బంది తప్పనిసరిగా బయోమెట్రిక్ హాజరు వేసేలా చూడాలని కలెక్టర్ పునరుదౌటించారు. సమస్యలను పరిష్కరిస్తున్న తీరు, బయోమెట్రిక్ హాజరే సచివాలయ సిబ్బంది. పనితీరుకు ప్రామాణికమని ఆయన స్పష్టం చేశారు. గ్రామాలలో పారిశుద్యానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని చెప్పారు. ఎస్.డబ్ల్యు.పి.సి. షెడ్ల నిర్మాణాలు త్వరగా పూర్తయ్యేలా చూడాలన్నారు. జగనన్న పాల వెల్లువ పథకంలో మరింత మంది పాడి రైతులు అమూల్ సంస్థకు పాలు పోసేలా చూడాలని, ఈ పథకం వల్ల కలిగే ప్రయో జనాలకు రైతులకు వివరించాలని కలెక్టర్ చెప్పారు. గతంలో పాలు పోసి మానేసిన రైతులతో ప్రత్యేకంగా మాట్లాడి, అందుకు కారణాలను తనకు నివేదించాలని చెప్పారు. జిల్లాలో బాల్య వివాహాలు ఎట్టి పరిస్థితులలోనూ జరగడానికి వీలు లేదని కలెక్టర్స్పష్టం చేశారు. మహిళా పోలీసు, ఐ.సి.డి.ఎస్. సిబ్బంది నిరంతరం పర్యవేక్షించాలని ఆయన ఆదేశించారు. వేసవి తీవ్రత పెరుగుతున్నందున వడదెబ్బ తగలకుండా తీసుకోవలసిన 'చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. జాయింట్ కలెక్టర్ ఎం.అభిషిక్ కిషోర్, ఇరిగేషన్ ఎస్.ఈ. లక్ష్మా రెడ్డి, డి.పి.ఓ. నారాయణ రెడ్డి, జిల్లా మత్స్యశాఖ అధికారి చంద్రశేఖరరెడ్డి, డి.సి.ఓ. రాజశేఖర్, పశు సంవర్ధక శాఖ జె.డి. బేబీరాణి, పరిశ్రమల శాఖ జి.ఎం. మధుసూదన్ రెడ్డి, ఏ.పి.డి. డి.పి.ఎల్. మేనేజర్ రాజమోహన్, డి.ఈ.ఓ. రమేష్, సచివాలయాల సమన్వయ అధికారి ఉషారాణి, పి.పి.ఓ. వెంకటేశ్వర్లు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గ్లోరియా పాల్గొన్నారు.

ఈ- క్రాప్ బుకింగ్ సామాజిక తనిఖీ

విశాలాంధ్ర-కొమరోలు : మండలంలోని రాజుపాలెం రైతు భరోసా కేంద్రం నందు ఈ- క్రాప్ బుకింగ్ సామాజిక తనిఖీ కొరకు ప్రదర్శించడం జరిగింది. 2023 రబి సీజనకు సంబంధించి పంట వేసిన ఒక ప్రతి ఒక్క రైతు పొలాలను సందర్శించి ఈ-పంట నమోదు చేయడం జరిగింది. గ్రామ స్థాయిలో ప్రతి గ్రామ వ్యవసాయ సహాయకులు ఈ క్రాప్‌కి సంబంధించిన జాబితాను రైతు భరోసా కేంద్రం నందు సామాజిక తనిఖీ కొరకు ప్రదర్శించడం జరిగింది. అనంతరం గ్రామ సభ నిర్వహించి ఈక్రాప్ జాబితాను చదవడం జరిగింది. రైతు సోదరులందరూ మీరు వేసిన పంటను యథావిధిగా బుకింగ్ చేశారా లేదా అని చూసుకొని ఏమైనా తప్పులు ఉంటే 1-2 రోజుల్లో సంబంధిత గ్రామ వ్యవసాయ సహాయకులకు తెలియజేసిన యెడల వారు తుది జాబితాలో మార్పు చేయగలరు. ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ గమనించి మీరు వేసిన పంటను సరిచూసుకోవాలని తెలియజేయడ మైనది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కె. రాజశ్రీ, గ్రామ వ్యవసాయ సహాయకులు కె.హనుమంతరెడ్డి రైతులు పాల్గొన్నారు.

కౌలు రైతుల సదస్సు జయప్రదం చేయండి

- ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు దేవండ్ల శ్రీనివాస్

విశాలాంధ్ర-దొనకొండ: ఈ నెల 17వ తేది ఒంగోలు సీపీఐ కార్యాలయంలో జరుగు కౌలు రైతుల జిల్లా సదస్సును జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు దేవండ్ల శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని రుద్రసముద్రం, దొనకొండ చుట్టు పక్కల గ్రామాల్లో ఆయన పర్యటించారు. కౌలు రైతుల సమస్యలను తెలియజేసే కరపత్రాలను రైతులకు పంచి పెట్టారు. అనంతరం విలేఖరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో దాదాపు 26 లక్షల మంది కౌలు రైతులు ఉండగా వారికి గుర్తింపు కార్డుల కల్పించక పోవటంతో ఎలాంటి సంక్షేమ ఫలాలు అందటం లేదన్నారు. చీడ పీడలు, ప్రకృతి వైపరిత్యాల కారణంగా రైతులు నష్ట పోతున్నారని, 2019 చట్టాన్ని సవరించి స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం భూ యజమానితో సంబంధం లేకుండా పంట రుణాలు ఇవ్వాలని, దేవాదాయ, ధర్మాదాయ కౌలు రైతులకు ఇవి వర్తింప చేసి 3 ఏళ్ళకు ఒక సారి పాట పెట్టాలని డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. ఆర్బీకేల్లో అందించే రైతు భరోసా కౌలు రైతులకు చెందటం లేదని, బ్యాంకుల్లో రుణాలు కల్పించేలా ప్రభుత్వం సహకరించాలని కోరుతున్నట్లు తెలిపారు. పలు సమస్యలపై ఒంగోలులో జరుగు కౌలు రైతుల సదస్సుకు మండలంలోని కౌలు రైతులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రధం చేయాలని శ్రీనివాస్ కోరారు. ఆయన వెంట రైతు సంఘం నాయకులు బాణాల రామయ్య పాల్గొన్నారు.

తిరునాళ్ల ఏర్పాట్లు పరిశీలించిన దర్శి డీఎస్పీ

విశాలాంధ్ర-కొనకనమిట్ల : మండలంలోని గార్లదిన్నె పంచాయితీలో గల వెలుగొండ క్షేత్రంలోని వెలుగొండ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో జరుగుతున్న బ్రహ్మోత్స వాల్లో భాగంగా నేడు గురువారం జరగనున్న వెలుగొండ స్వామి తిరుణాల పురస్కరించుకొని బుధవారం దర్శి డిఎస్పి సూర్యనారాయణరెడ్డి ఏర్పాట్లను పరిశీలించారు. స్వామివారి ఆలయ ప్రాంగణంలో ప్రభలు ఏర్పాటు చేసే ప్రదేశాలను అంగళ్లు ఏర్పాటు చేసే ప్రదేశా లనునిశితంగా పరిశీలించారు. తిరుణాల ఏర్పాట్లపై ఆలయ కమిటీ చైర్మన్ తిరుపతిరెడ్డి ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి కమిటీ నిర్వాహకులతో మాట్లాడారు వివాదాలు తలెత్తకుండా చూసుకోవాలని ప్రశాంతంగా తిరుణాల జరుపుకోవాలని వారికి తెలిపారు. తిరునాళ్లలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా గట్టి భద్రతా చర్యలు తీసుకుంటున్నట్లు డి.ఎస్.పి పేర్కొన్నారు. డిఎస్పితో పాటు పొదిలి సీఐసుధాకర్‌రావు కొనకనమిట్ల ఎస్ఐ కే దీపిక సిబ్బంది పాల్గొన్నారు.

రేపు కౌలు రైతుల జిల్లా సదస్సు

- సదస్సుకు హాజరుకానున్న ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్
- జయప్రదం చేయాలంటూ ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు డి.శ్రీనివాస్, వడ్డే హనుమారెడ్డి

విశాలాంధ్ర-ఒంగోలు : ఈనెల 17న కౌలు రైతుల జిల్లా సదస్సు స్థానిక మల్లయ్య లింగం భవనంలో నిర్వహిస్తున్నట్లు ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు డి శ్రీని వాసరావు, వడ్డే హనుమారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ పంట సాగు దారు హక్కుల చట్టం 2019ని సవరించి భూ యజమాని ప్రమేయం లేకుండానే కౌలు గుర్తింపు కార్డులు జారీ చేయాలని, సిసిఆర్‌సి కార్డులు పొందిన కౌలు రైతులకుభూ యజమాని తీసుకునే స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పంట రుణాలు ఇవ్వాలని, సొంత భూమిలేని కౌలు రైతులందరికీ ఎకరాకు రూ.10 వేలు ఇవ్వాలని, కౌలు రైతుల స్వీయ ధ్రువీకరణతో ఆర్‌బికే అధికారులు నిర్ధారించుకుని ఈక్రాప్ నమోదు చేసి ఉచిత పంటల బీమా, నష్టపరిహారం, పెట్టుబడి రాయితీ, పంటలు అమ్ముకునే వెసులు బాటు తదితర సౌకర్యాలు కల్పించాలని, 55 సంవత్సరాలు పైబడిన ప్రతి కౌలు రైతుకు ప్రతి నెల రూ.10 పింఛన్ ఇవ్వాలని, కౌలు రేట్లు నిర్ణయించదానికి కౌలు రైతుల ధరల నియంత్రణ చట్టం తీసుకురావాలని, దేవాదాయ ధర్మాదాయ కౌలు రైతులకు రైతాంగానికి వర్తింపజేసే వ్యవసాయ సబ్సిడీ పథకాలన్నీ అందించాలని, దేవాదాయ ధర్మాదాయ భూములకు మూడు సంవత్సరాలకు పాట నిర్వహించాలని డిమాండ్లతో ఈ సదస్సు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే వివి ప్రసాద్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏ కాటమయ్య, సామాజిక వన రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కే వీరారెడ్డి హాజరవుతారని తెలిపారు.ఈ సదస్సుకు విరివిగా పౌండేషన్ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

కనిగిరి అన్న క్యాంటీన్‌కి రూ.లక్ష విరాళం

విశాలాంధ్ర-వెలిగండ్ల : శ్యామల వెంకట్ రెడ్డి ఫౌండేషన్ అధ్యక్షులు నియోజక వర్గ టిడిపి నాయకులు శ్యామల కాశిరెడ్డి కనిగిరి అన్న క్యాంటీన్‌కి లక్ష రూపాయలు విరాళం అంద జేశారు. బుధవారం కనిగిరిలోనే తెలుగుదేశం కార్యాలయమైన అమరావతి గ్రౌండ్స్‌లో వెలిగండ్ల మండల తెలుగుదేశం అధ్యక్షులు ముత్తిరెడ్డి వెంకటరెడ్డి, నియోజకవర్గం క్లస్టర్ ఇంచార్జ్ దొడ్డ వెంకటసుబ్బారెడ్డి, నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షులు కెలం ఇంద్రభూపాల్‌రెడ్డి, కనిగిరి టిడిపి ఇన్చార్జి మాజీ శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డినీ కలసి శ్యామల కాశిరెడ్డి పంపించిన లక్ష రూపాయల విరాళాన్ని ఆయనకు అందజేశారు. మాట్లాడుతూ శ్యామల కాశిరెడ్డి పేదల దానధర్మాలు చేయడంలో ముందుంటారని అందులో భాగంగా ఉగ్ర అన్న తలపెట్టిన అన్న క్యాంటీన్ కనిగిరిలో నిరంతరాయంగా నిర్వహించాలని ఉద్దేశంతో ఈ ఆర్థిక సహాయాన్ని అందించడం జరిగిందని వారు తెలిపారు. ఎంతోమంది తమ ప్రయోజనాల కోసం మాత్రమే పాటుపడతారని కానీ ఎక్కడ ఎటువంటి దానధర్మాలు కావాలన్నా శ్యామలన్న ముందు ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వెలిగండ్ల మండల తెలుగు రైతు అధ్యక్షులు మినీగా కాశయ్య మొటాటి సుబ్బారెడ్డి, రావూరి వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బడుగు బలహీనవర్గాల ఆశ జ్యోతి కాన్షిరాం

విశాలాంధ్ర-దర్శి : దర్శి నియోజకవర్గ కమిటీ ఆధ్వర్యంలో మాజీ సర్పంచ్ కోటా నాగేంద్రం అధ్యక్షతన దళిత, బడుగు బలహీన వర్గాల బహుజనల శాజ్యోతి మన్యశ్రీ కాన్షిరాం 89వ జయంతి సభ నిర్వహిం చారు. పంజాబ్ రాష్ట్రంలో కురుగ్రామంలో 1934 మార్చి 15 తారీకున ఆయన జన్మించారని అప్ప ట్నుండి బడుగు బలహీన వర్గాలపై జరుగుతున్న ఆకృత్యాలను సరిచూసి అంబేద్కర్ వారసుడిగా ఉత్తర ప్రదేశ్లో రాజ్యాధికార దిశగా అడుగులు వేసి కుమారి మాయవతి ముఖ్యమంత్రిగా చేసి రాజ్యాధికారం ఆయుధంగా నిరూపించిన మహానీయుడు మన్యశ్రీ కాన్షిరాం అని ఆయన కొనియాడారు. ముందుగా చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. గర్నెపూడి ప్రభాకర్, గండి. ఇశ్రాయేలు, కోట, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

బీఎస్ నారాయణరెడ్డికి అంతర్జాతీయ అవార్డు

విశాలాంధ్ర-గిద్దలూరు : ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించిన యోగా టీచర్ బీఎస్ నారాయణరెడ్డికి పొద్దుటూరుకు చెందిన మన ఫౌండేషన్ సేవా సంస్థ అంతర్జాతీయ కీర్తి అవార్డుకు 2023 ఎంపిక చేశారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాల్లో భాగంగా కరోనా సమయంలో కడప జిల్లా బద్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి మూడు ఆక్సిజన్ కాన్సెంట్రేటర్స్ ఐ ఏ హెచ్ వి,ఆర్ట్ ఆఫ్ లివింగ్ ప్రకాశం జిల్లా గిద్దలూరు ప్రభుత్వ ఆసుపత్రికి మూడు ఆక్సిజన్ కాన్సెంట్రేటర్స్ 8 లక్షల పైగా విలువ చేసేటివి ఎం ఎల్ ఎ అన్నావెంకట రాంబాబు చేతులమీదుగా అందించారు. గిద్దలూరు, బద్వేలి తాలూకాల్లో ఉండే పత్రిక విలేకరులు ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియా వారికి కరోనా సమయంలో ఇమ్యూనిటీ పెరగడానికి దాదాపు 80,000 పైగా బ్యాక్ టు ద రూట్స్ వీరవల్లి సుధాకర్ ఆర్థిక సహకారంతో ఆయుర్వేద మాత్రలు పంపిణీ చేయడం జరిగింది.ఐ ఏ హెచ్ వి ఆర్ట్ ఆఫ్ లివింగ్ వారి ఆర్థిక సాయంతో గిద్దలూరు,బద్వేల్ తాలూకాలోని ప్రభుత్వ ఆసుపత్రులకు ఎన్95, 800 మాస్కులు అందజేయడం జరిగింది. విద్యార్థిని, విద్యార్థులకు ఉచిత నవచేతనా శిబిరాలు యోగా నిర్వహించారు.యువతకు నాయకత్వ లక్షణాలపై శిక్షణ, దాతల సహకారంతో తల్లి తండ్రి లేని పేద విద్యార్థిని విద్యార్థులకు చదువుకోడానికి పుస్తకాలు మరియు విద్యా సామాగ్రి అందజేయడం అభాగ్యులకు బోజనాలు బట్టలుఅందించడం వంటి సేవ చేయడం,అనాథ శవాలకు అంత్యక్రియలు నిర్వహించడం, అభాగ్యులకు మెడికల్ ట్రీట్మెంట్ చేయించడం, ఆపరేషన్ చేయించడం వంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నందుకు కడప జిల్లా పొద్దుటూరు కు చెందిన మనం ఫౌండేషన్ వారు ఆన్లైన్ ద్వారా అంతర్జాతీయ కీర్తి అవార్డ్ 2023కు ఎంపిక చేసిన మనం ఫౌండేషన్ ఛైర్మెన్ డాక్టర్ కె చక్రవర్తి కి బియస్ నారాయణరెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు. అవార్డు పొందినందులకు ఆర్ట్ ఆఫ్ లివింగ్ కుటుంబ సభ్యులు, స్నేహితులు,బంధువులు అభినందనలు తెలిపారు. మరెన్నో సేవా కార్యక్రమాలు చేస్తూ ముందుకు నడవాలని గిద్దలూరు, బద్వేల్ తాలూకా ప్రజలు ఆశీర్వదించారు.

16న కౌంటింగ్‌కు సర్వం సిద్ధం

- ఆర్‌వీఎస్ కళాశాలలో ఉదయం 8 గంటలకు కౌంటింగ్
- కౌంటింగ్ ప్రక్రియకు 916 మంది సిబ్బంది నియామకం
- రిటర్నింగ్ అధికారి, కలెక్టర్

విశాలాంధ్ర-ఒంగోలు : ఈ నెల 16న ప్రకాశం-నెల్లూరు-చిత్తూరు ఉపాధ్యా య, పట్టభద్రుల నియోజక వర్గ ఎం.ఎల్.సి.ఎన్నికల కౌంటింగ్ నిర్వహించనున్న నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్, రిటర్నింగ్ అధికారి యం.హరినారాయణన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. భారత ఎన్నికల సంఘం విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం ఈ నెల 13న ఉమ్మడి ప్రకాశం -నెల్లూరు-చిత్తూరు ఉపా ధ్యాయ, పట్టభద్రుల నియోజకవర్గ ఎం.ఎల్.సి. ఎన్నికల పోలింగ్ నిర్వహించడం జరిగిందని, పట్టభద్రుల ఎం.ఎల్.సి ఎన్నికలకు సంబంధించి తిరుపతిలోని 229 మరియు 233 పోలింగ్ స్టేషన్లలో ఈ నెల 15న రీ పోలింగ్ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈ నెల 16న గురువారం చిత్తూరు ఆర్.వి.ఎస్. లా కాలేజ్ నందు ఉపాధ్యాయ ఎం.ఎల్.సి., ఇంజనీరింగ్ కళాశాల నందు పట్టభద్రుల ఎం. ఎల్.సి. ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ ఉదయం 8 గంటలకు నిర్వ హించడం జరుగుతుందని, అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. ఈ మేరకు కౌంటింగ్ సిబ్బందికి అవసరమైన శిక్షణను ఇవ్వడం జరిగిందని తెలిపారు. పట్టభద్రుల ఎం.ఎల్.సి. కౌంటింగ్ కొరకు 40 టేబుల్స్, ఉపాధ్యాయ ఎం.ఎల్.సి కౌంటింగ్‌కు 14 టేబుల్స్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ ప్రక్రియలో 193 మంది కౌంటింగ్ సూపర్వైజర్లు, 551 మంది కౌంటింగ్ అసిస్టెంట్లు, 172 మంది మైక్రో అబ్జర్వర్లు మొత్తం 916 మంది సిబ్బంది పాల్గొననున్నారని తెలిపారు.

'ఈ-క్రాప్' నమోదు సరిచూసుకోండి

విశాలాంధ్ర-గిద్దలూరు : మండలంలోని గడికోట రైతు భరోసా కేంద్రం నందు ఈ-క్రాప్ బుకింగ్ పై సామాజిక తనిఖీ మరియు గ్రామసభ నిర్వహించడం జరిగింది. 2023 రబి సీజనకు సంబంధించి పంట వేసిన ఒక ప్రతి ఒక్క రైతు పొలాలను సందర్శించి ఈ-పంట నమోదు చేయడం జరిగింది. గ్రామస్థాయిలో ప్రతి గ్రామ వ్యవసాయ సహాయ కులు ఈ క్రాప్‌కి సంబంధించిన జాబితాను రైతు భరోసా కేంద్రం నందు సామాజిక తనిఖీకి కొరకు ప్రదర్శించడం జరిగింది. అనంతరం గ్రామ సభ నిర్వహించి ఈక్రాప్ జాబితాను చదవడం జరిగింది. రైతు సోదరులందరూ మీరు వేసిన పంటను యధావిధిగా బుకింగ్ చేశారా లేదా అని చూసుకొని ఏమైనా తప్పులు ఉంటే 1-2 రోజుల్లో సంబందిత గ్రామ వ్యవసాయ సహాయకులకు తెలియజేసిన యెడల వారు తుది జాబితాలో మార్పు చేయగలరు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి విజయభాస్కర్‌రెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.